క్లుప్తంగా

కనువిందు చేస్తున్న మే పుష్పాలు



అల్లూరి పార్కులో కనువిందు చేస్తున్న పుష్పాలు

గొలుగొండ : అల్లూరి పార్కులో మే పుష్పాలు కనువిందు చేస్తున్నాయి. ప్రతి ఏటా మే నెలలో విరబూసీ ఈ పుష్పాలు చూపరులను కనువిందు చేస్తున్నాయి. అల్లూరి పార్కులో మూడు చోట్ల ఈ పుష్పాలు ఎక్కువగా విరబూసాయి. అక్కడికి వచ్చిన పర్యాటకులు వీటిని చూసి ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థులకు నీతి కథల బోధన

కె.కోటపాడు : విద్యార్థులు నీతి కథల్లో గల మంచిని గ్రహించి సత్ప్రవర్తనతో మెలగాలని చౌడువాడ శాఖా గ్రంథాలయాదికారిణి ఎం.పద్మావతి తెలిపారు. వేసవి విజ్ఞాన శిబిరం కార్యక్రమంలో భాగంగా బుధవారం విద్యార్థులకు నీతి కథల పుస్తకాలను చదివించారు. అనంతరం బాస్కెట్ బాల్ పోటీలను నిర్వహించారు. విద్యార్థులు చదువులకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు క్రీడలపైనా ఆసక్తిని కనబర్చాలని పద్మావతి సూచించారు.

నేడు కామేశ్వరమ్మ పండగ



ఆలయానికి ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలంకరణ

మాకవరపాలెం : రాచపల్లి జంక్షన్‌లో వెలసిన కామేశ్వరమ్మతల్లి పండగను గురువారం భారీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఏటా ఈ పండగను స్థానికులు అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ఈ ఏడాది కూడా ఘనంగా జరుపుకొనేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి విద్యుద్దీపాలంకరణ ఏర్పాటు చేశారు. పండగ రోజు రాత్రి రాచపల్లి గ్రామంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

కోతుల దాడిలో మామిడి తోటల ధ్వంసం

మాడుగుల రూరల్ : మామిడి తోటలపై కోతులు దాడి చేసి పక్వానికి వచ్చిన కాయలను తెంపి కొరికి నాశనం చేస్తున్నాయి. మండలంలో కె.జె.పురం పంట పొలాల్లో కోతుల గుంపులు విచ్చల విడిగా సంచరిస్తూ పక్వానికి వచ్చిన మామిడి కాయలను పాడు చేస్తున్నాయి. దీంతో పాటు జీడి మామిడి, పనస పండ్లు కూడా పాడు చేస్తున్నాయి. కోతులు గుంపులు గుంపులుగా సంచరిస్తూ కూరగాయల పంటలు పాడు చేస్తున్నాయి. దబ్బకుంటు రహదారి పక్కన వేసిన వంగ, బీర ఇతర పంటలు ధ్వంసం చేస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోతుల బారి నుంచి రైతులను కాపాడాలని కోరుతున్నారు.

ప్రకృతి సాగుపై అవగాహన



రైతులకు విత్తనాల కిట్లను అందజేస్తున్న సర్పంచ్, అధికారులు

మాకవరపాలెం : ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. బూరుగుపాలెంలో బుధవారం రైతులతో వ్యవసాయ, ప్రకృతి సేద్య అధికారులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో చిరంజీవి మాట్లాడుతూ ప్రకృతి సేద్యం చేసే విధానం, దిగుబడులు, సాగుకయ్యే ఖర్చుల వివరాలను తెలియజేశారు. ఈ విధానంలో సాగు చేయడం ద్వారా రసాయన రహిత పంటలు పొందవచ్చన్నారు. అనంతరం రైతులతో ర్యాలీ నిర్వహించి, ఉత్తమ రైతులకు సత్కారం చేశారు. నవధాన్య విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బొబ్బలరెడ్డి వెంకటరమణ, ప్రకృతి సేద్య మండల ఇన్‌చార్జ్ కవిత పాల్గొన్నారు.

కేజేపురంలో తాగునీటి సమస్య

మాడుగుల రూరల్: మండలంలో మేజర్ గ్రామ పంచాయతీ అయిన కె.జె.పురం గ్రామంలో తాగునీటి సమస్య ఎక్కువగా ఉంది. గ్రామానికి అందించే తాగునీటి పథకాలకు చెందిన విద్యుత్ మోటారు కాలిపోయింది. దీంతో సోమవారం నుంచి తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అసలే మండు వేసవి, దీనికి తోడు తాగునీటి సమస్య ఎక్కువగా ఉంది. దీనికి తోడు జల్‌జీవన్ మిషన్ పథకంలో ఏర్పాటు చేసిన ఇంటింటి కుళాయి కనెక్షన్ల ద్వారా కొన్ని చోట్ల మాత్రమే నీరు వస్తుంది. 75 శాతం కుళాయిలకు నీరు రావడం లేదు. ఈ విషయపై స్థానిక పంచాయతీ కార్యదర్శి నవీన్‌దొరను బుధవారం వివ రణ కోరగా, మోటారు కాలిపోవడం వల్ల తాగునీటి సమస్య ఉందని తెలిపారు. కొత్త మోటారు కొనుగోలు చేశామని, గురువారం నాటికి సమస్య పరిష్కారం అవుతుందని తెలిపారు.

రోడ్డుపైనే సంత... 108కు చింత



కేజీ రోడ్డు మలుపులో ట్రాఫిక్‌లో చిక్కుకున్న 108 వాహనం

- బుచ్చెయ్యపేటలో సంత రోజు అవస్థలు
- స్థలం ఉన్నా రోడ్డుపైనే సంత



పోలీస్‌స్టేషన్ రోడ్డులో వాహనాలు అడ్డుగా పెట్టడంతో నిలిచిపోయిన 108 వాహనం

బుచ్చెయ్యపేట : మండల కేంద్రంలో ప్రతి బుధవారం సంత రోజున ట్రాఫిక్ నిలిచిపోతుంది. వారం సంత రోజు అవడంతో పలువురు వ్యాపారులు, రైతులు వచ్చి పలు రకాల పంటలు కొనుగోలు,అమ్మకాలు చేస్తారు. వ్యాపారులు కొంతమంది కశింకోట, బంగారుమెట్ట(కేబీ) రోడ్డుకు ఇరువైపులా దుకాణాలు వేస్తున్నారు. దీంతో అనకాపల్లి, వడ్డాది వైపు ఎదురెదురుగా వెళ్లే వాహనదారులు తప్పుకునే వీలు లేకపోతుంది. బీఎస్ రోడ్డులో జనం రద్దీతో రెండువైపులా వెళ్తున్న వాహనాలు తప్పుకునే వీలు లేకుండా ట్రాఫిక్ జామ్ అయ్యి వాహనాలు రోడ్డు మధ్యలో నిలిచిపోతున్నాయి. పలువురు వ్యాపారులు, కొనుగోలుదారులు తమ వాహనాలను కేబీ రోడ్డు నుంచి పోలీస్‌స్టేషన్,తహసీల్దార్ కార్యాలయాలకు వెళ్లే సిమెంట్ రోడ్డుపై ఉంచుతున్నారు. దీంతో అత్యవసర సమయంలో వేగంగా వెళ్లడానికి వస్తున్న 108 వాహనానికి దారి లేకుండా పోతుది. బుధవారం జరిగిన సంతలో రోడ్డుపై నిలిచిన వాహనాలు, రోడ్డుకిరువైపులా ఉన్న జనం రద్దీతో 108 వాహనం ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకుంది. రోడ్డు పక్కనే విశాలంగా చెరకు యార్డు స్థలం ఖాళీగా ఉంది. అధికారులు, నాయకులు సమయ్వయంతో రైతులు, వ్యాపారులు దుకాణాలను రోడ్డుకు ఇరువైపులా వేయకుండా చెరకు యార్డులో దుకాణాలు వేసుకునేలా అవగాహన కల్పించాలని పలువురు కోరుతున్నారు. జిల్లా కేంద్రం అనకాపల్లి, మండల కేంద్రం బుచ్చెయ్యపేట వెళ్లడానికి వందలాది వాహనాలు ఈ రోడ్డు గుండానే నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు. బుధవారం సంత రోజున ట్రాఫిక్ జామ్‌తో అత్యవసరంగా వెళ్లే ప్రయాణికులకు ఆటంకాలు జరుగుతున్నాయి. పోలీసులు, పంచాయతీ అధికారులు ట్రాఫిక్ నిలిచిపోకుండా చర్యలు చేపట్టాలని పలువురు ప్రయాణికులు కోరుతున్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామికి పుష్పాల సేవ

నందడిగా స్వామివారి వార్షిక కల్యాణోత్సవాలు




స్వామివారికి పూలంగి సేవ చేస్తున్న అర్చకులు

చోడవరం: స్థానిక ఆపదహర శ్రీనివాస క్షేత్రంగా బాసిల్లుతున్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి వార్షిక కల్యాణోత్సవాలు కన్నులపండువగా బుధవారం ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా స్వామివారికి రాత్రి కన్నులపండువగా పూలంగిక సేవ చేశారు. పలు రంగుల పువ్వులతో స్వామివారి పూల పాన్పును తయారు చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించి శ్రీదేవి, భూదేవి సమేతుడైన వేంకటేశ్వరస్వామివారి ఉత్సవ విగ్రహాలను సర్వాంగసుందరంగా అలంకరించి, పూలంగిక సేవ చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు శాంతారామాచార్యులు, వాసు ఆధ్వర్యంలో వేదపండితులు మంత్రోచ్చరణ మధ్య పూలంగిక సేవ వైభవంగా జరిగింది. గ్రామంలో మహిళలు పెద్దసంఖ్యలో పూలు, పండ్లు తెచ్చి స్వామివారికి సమర్పించారు. ఆలయ కమిటీ చైర్మన్ వింజమూరి శంకర్, దేవదాయశాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సత్యనారాయణమూర్తి, ఆలయ కమిటీ ప్రతినిధులు ఉపాధ్యాయుల శ్రీనివాస్ పాల్గొని స్వామివారికి పూజలు చేశారు.

19న ఉపాధ్యక్ష పదవి ఎన్నికకు సమావేశం

మాడుగుల : మండల పరిషత్ ఉపాధ్యక్ష పదవి ఎన్నికకు ఈనెల 19వ తేదీన ఎంపీటీసీలతో సమావేశం జరగనుందని ఎంపీడీవో కొంకి అప్పారావు అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు మండలంలో గల ఎంపీటీసీలతో సమావేశం జరగనుందన్నారు. ఈ సమావేశానికి మండలంలో గల ఎంపీటీసీలు విధిగా హాజరు కావాలన్నారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారాం హాజరు కానున్నారన్నారు.

ధ్వజస్తంభం ప్రతిష్ట వాయిదా



ధ్వజ స్తంభం ప్రతిష్ఠించాల్సిన వేంకటేశ్వర ఆలయం

రోలుగుంట : స్థానిక కొండపైన వెలసిన వేంకటేశ్వర ఆలయంలో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు మహలక్ష్మమ్మ ఆలయ నిర్మాణానికి గ్రామస్తులు నిర్ణయించారు. వారం రోజులుగా మహలక్ష్మమ్మ ఆలయ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ధ్వజ స్తంభం ఏర్పాటు కోసం భక్తుల నుంచి ఇత్తడి లోహ సేకరణ కూడా చేపట్టారు. ఇక్కడ ఈ నెల 18న ధ్వజస్తంభం ప్రతిష్ఠించాలని నిర్ణయించారు. అయితే అనివార్య కారణాలతో ధ్వజస్తంభం ప్రతిష్ఠ కార్యక్రమాన్ని వాయిదా వేశారు. వచ్చే నెల 6న ఏకాదశి రోజు ఈ కార్యక్రమం నిర్వహిస్తామని ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి శ్రీనివాసాచార్యులు తెలిపారు. దాతలు ఆలయ నిర్మాణానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

8 లక్షల పని దినాలు కల్పించడమే లక్ష్యం



సమీక్షిస్తున్న ఎంపీడీవో ఉషాశ్రీ

నాతవరం : ఉపాధి హామీ పథకంలో ఈ ఏడాది 8 లక్షల మందికి పని దినాలు కల్పించడమే ధ్యేయంగా పని చేయాలని ఎంపీడీవో కె.ఉషాశ్రీ అన్నారు. ఆమె మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉపాధి హామీ పథకం సిబ్బంది పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోనే అధికంగా కూలీలు పని చేసే మండలంగా నాతవరం ప్రత్యేకత సంతరించుకుందన్నారు. దానిని దృష్టిలో పెట్టుకుని ఉపాధి హామీ పథకం సిబ్బంది అంకిత భావంతో పని చేసి పని దినాలు లక్ష్యాన్ని అధిగమించాలన్నారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి అవకతవకలు లేకుండా జాగ్రత్తలు చేపట్టాలని, ఎండ తీవ్రత కారణంగా కూలీలకు వడ దెబ్బ తగలకుండా సిబ్బంది ఏర్పాట్లు చేయాలని అన్నారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు వేసవిలో ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఉపాధి ఏపీవో దాసరి కొండాజీ పాల్గొన్నారు.

మోదకొండమ్మ జాతర ఏర్పాట్లపై నేడు సమావేశం

మాడుగుల : స్థానిక మోదకొండమ్మ ఆలయం వద్ద వచ్చే నెల 3వ తేదీన జరగనున్న మోదకొండమ్మ పండగ నిర్వహణకు మండల స్థాయి అధికారులతో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఉదయం సమావేశం జరగనుందని ఎంపీడీవో కొంకి అప్పారావు తెలిపారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజుతో పాటు ఇతర కమిటీ సభ్యులు హాజరు కానున్నారని, మండల అధికారులంతా హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



కె.కోటపాడులో సీడీపీవో మంగతాయారుకు వినతిపత్రం అందిస్తున్న కుమారి

కె.కోటపాడు : అంగన్‌వాడీ సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు కుమారి తెలిపారు. ఈ నెల 20న చేపట్టనున్న సమ్మెలో అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొనున్నట్టు తెలుపుతూ బుధవారం సీడీపీవో మంగతాయారుకు నోటీసు అందించారు. ఈ సందర్భంగా కుమారి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్స్‌ను తెచ్చిందన్నారు. లేబర్‌కోడ్స్‌ను రద్దు చేయాలని కోరుతూ కేంద్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్‌లు ఈ నెల 20న దేశ వ్యాప్త సమ్మె చేసేందుకు నిర్ణయించినట్టు తెలిపారు. అంగన్‌వాడీ సిబ్బందికి రూ.20వేలు కనీస వేతనం ఇవ్వాలని, గ్రాట్యూటీ జీవో నెంబర్ 8ని మార్పు చేసి పింఛను, పీఎఫ్, ఈఎస్‌ఐ అమలు చేయాలని కోరారు. మినీ సెంటర్‌లను మెయిన్ సెంటర్‌లుగా మార్చుతూ జీవోను ఇవ్వాలని కుమారి పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త లక్ష్మి, సీఐటీయూ నాయకులు నాయినిబాబు, నాయుడుబాబు పాల్గొన్నారు.

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం



ఆటల్లో పాల్గొన్న విద్యార్థులు

చీడికాడ: చీడికాడ శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న సమ్మర్ ఓరియెంటేషన్ క్లాసుల్లో బుధవారం క్రీడలు నిర్వహించారు. క్రీడలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. క్రీడల వల్ల కలిగే ప్రయోజనాలను గ్రంథాలయాధికారి ఎం .జోగేశ్వరి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలన్నారు.

వరిలో అధిక దిగుబడులపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ కళాశాల విద్యార్థినులు

రావికమతం : కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వ్యవసాయ కళాశాల విద్యార్థినులు మంగళవారం మత్స్యవానిపాలెం గ్రామంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వరి పంటలో అధిక దిగుబడులు రావాలంటే ఎటువంటి జాగ్రత్తలు పాటించాలో పటం ద్వారా రైతులకు వివరించారు. ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్. కిశోర్‌కుమార్ ఆధ్వర్యంలో క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా బీఎస్సీ విద్యార్థినులు గ్రామం మధ్యలో పటం వేసి వరిలో దిగుబడి తగ్గడానికి అధిక రసాయనాలు వాడటం, పంట మార్పిడి చేయకపోవడం కారణమని రైతులకు వివరించారు. కార్యక్రమంలో విద్యార్థినులు రచన, చరిష్మా, అంకిత, మణిదీపిక, బిందు మాధవి, మేఘన పాల్గొన్నారు.

ఆరోగ్య ఉప కేంద్రం...నిరుపయోగం



ఎ.కోడూరులో నిరుపయోగంగా ఉన్న భవనం

కె.కోటపాడు : ఎ.కోడూరు గ్రామంలో గల ఆరోగ్య ఉపకేంద్రం భవనం నిరుపయోగంగా ఉంది. ఉపకేంద్రం పరిధిలో గల గ్రామాల్లో ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు 23 ఏళ్ల క్రితం గ్రామం శివార్లలో భవనాన్ని నిర్మించారు. గ్రామానికి దూరంగా భవనం ఉండడంతో రోగులు ఇక్కడకు రావడానికి ఆసక్తి చూపలేదు. దీంతో గ్రామంలోనే వైద్య సిబ్బంది అద్దె భవనంలో ఆరోగ్య ఉపకేంద్రం నిర్వహణను ప్రస్తుతం సాగిస్తున్నారు. దీంతో లక్షలాది రుపాయలు వెచ్చించి నిర్మాణం చేపట్టిన ఆరోగ్య ఉపకేంద్రం భవనం నిరుపయోగంగా మారింది. ప్రస్తుతం ఆ భవనం శిథిలావస్థకు చేరుకుంది. గ్రామంలో గతంలో హోమియోపతి వైద్య సేవలు అందేవి. ఈ కేంద్రానికి సొంత భవనం లేక హోమియో వైద్యాన్ని కె.కోటపాడులో గల 50 పడకల ఆస్పత్రికి తరలించారు. శిథిలావస్థకు చేరిన ఆరోగ్య ఉపకేంద్రం భవనానికి మరమ్మతులు నిర్వహించి హోమియో వైద్యాన్ని ఎ.కోడూరులోనే ఉండేలా వైద్య ఆరోగ్య శాఖాధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నర్సీపట్నంలో కుండపోత వర్షం



పట్టణంలో మెయిన్ రోడ్డుపై చేరిన వర్షం నీటిలో నుంచి రాకపోకలు సాగిస్తున్న వాహనాలు

నర్సీపట్నం : నర్సీపట్నంలో మధ్యాహ్నం కుండపోత వర్షం కురిసింది. రెండు రోజులుగా కాసిన ఎండలకు ప్రజలు బెంబేలెత్తారు. ఉక్కపోతతో అల్లాడారు. బుధవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భానుడి ప్రతాపానికి జనం విలవిలాడారు. ఒక్కసారిగా వాతావరణ చల్లబడి, ఆకాశం మేఘావృతమై వర్షం కురిసింది. దీంతో జనం ఎండవేడిమి నుంచి ఉపశమనం పొందారు. కుండపోత వర్షానికి పట్టణంలో ప్రధాన డ్రైనేజీ పొంగి వర్షపు నీరు మెయిన్‌రోడ్డుపై ఏరులై పారింది. ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచి వద్ద మెయిన్ కల్వర్టు కూరుకుపోవడంతో వర్షం నీరు మెయిన్‌రోడ్డుపై చేరి చెరువును తలపించింది. వాహనాల రాకపోకలకు కొద్దిసేపు అంతరాయం ఏర్పడింది.

వీఆర్పీల ఆకలి కేకలు

మూడు నెలలుగా అందని జీతాలు



బుచ్చెయ్యపేటలో నిరసన వ్యక్తం చేస్తున్న వీఆర్పీలు

బుచ్చెయ్యపేట : మండలంలో వీఆర్పీలకు మూడు నెలలుగా జీతాలు అందలేదు. కుటుంబాలతో అర్ధాకలితో అలమటిస్తున్నామని, తక్షణం ప్రభుత్వం జీతాలు అందించి ఆదుకోవాలని బుధవారం బుచ్చెయ్యపేటలో నిరసన వ్యక్తం చేశారు. మండలంలో ఉన్న 35 పంచాయతీ గ్రామాల్లో జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా వీఆర్పీలు ప్రతి రోజు సుమారు 8 వేల మంది కూలీలకు పనులు కల్పిస్తున్నారు. కూలీలకు రోజువారి పనులతో పాటు గ్రామాల్లో రోడ్లు, చెరువులు, కాలువలు, ఇంకుడు గుంతలు, ట్రెంచ్‌లు, పండ్ల తోటల పెంపకం ఇతర పలు అభివృద్ధి కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. ప్రతి రోజు ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం వరకు పని చేస్తున్నా వీరికి మాత్రం నెలవారీ జీతాలు సకాలంలో అందించడం లేదని మండల వీఆర్పీల సంఘం అధ్యక్షుడు యన్నంశెట్టి సన్యాసిరావు, ఉపాధ్యక్షుడు కొల్లి కశింనాయుడు, కార్యదర్శి తాటికొండ శ్రీనివాసరావు, కోశాధికారి కురసా రమేష్ వాపోయారు. ఫిబ్రవరి,మార్చి,ఏప్రిల్ మూడు నెలలు జీతాలు అందించాలని కోరుతూ బుధవారం మండల కేంద్రంలో నిరసన వ్యక్తం చేశారు.

వేతన కార్యదర్శి, హెల్పర్లకు కనీస వేతనాలు చెల్లించాలి



బత్తివానిపాలెంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

కె.కోటపాడు : విశాఖ డెయిరీలో పని చేస్తున్న వేతన కార్యదర్శి, హెల్పర్‌లకు డెయిరీ యాజమాన్యం కనీస వేతనాలను అందించాలని పెయిడ్ సెక్రటరీస్ యూనియన్ అధ్యక్షుడు పి.సత్యనారాయణ అన్నారు. మండలంలో బత్తివానిపాలెం బల్క్‌మిల్క్ కూలింగ్ సెంటర్ వద్ద బుధవారం వేతన కార్యదర్శులు, హెల్పర్లు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ఉద్యోగ విరమణ చేసిన వేతన కార్యదర్శులకు గ్రాట్యూటీని రూ.5లక్షలు, హెల్పర్‌లకు రూ.3 లక్షలు ఇవ్వాలని ఆయన కోరారు. సిబ్బందికి విశాఖ డెయిరీ నుంచే వేతనాలు మంజూరు అయ్యేలా చూడడంతో పాటు పాల సంఘాల్లో పని చేస్తున్న ఉద్యోగులకు టైం లిమిట్‌తో కూడిన ఉద్యోగ భద్రతను కల్పించాలని సత్యనారాయణ కోరారు. లేబర్ యాక్ట్ ప్రకారం సెలవులను సిబ్బందికి అమలు చేసేలా చర్యలను తీసుకోవాలని డెయిరీ యాజమాన్యాన్ని కోరారు. సమావేశంలో యూనియన్ నాయకులు చిన్ని వెంకట నర్సింహమూర్తి, సూర్యారావు, నరసింహమూర్తి, ప్రసాద్, ఎస్.కాశీరావు, కనకరావు, అప్పలనాయుడు, డి.రామారావు పాల్గొన్నారు.

రాయితీపై పవర్ టిల్లర్ల పంపిణీ



దేవరాపల్లిలో లబ్ధిదారులకు పవర్ టిల్లర్లను అందజేస్తున్న ఎమ్మెల్యే బండారు

దేవరాపల్లి : ప్రభుత్వం వ్యవసాయశాఖ ద్వారా రాయితీపై సరఫరా చేసిన పవర్ టిల్లర్లను స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి చేతుల మీదుగా బుధవారం అందజేశారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో స్థానిక ఏవో ఎల్.వై.కాంతమ్మ సమక్షంలో 14 మంది లబ్ధిదారులకు పవర్ టిల్లర్లను ఎమ్మెల్యే అందజేశారు. పవర్ టిల్లర్లతో పాటు వివిధ వ్యవసాయ పనిముట్లు అందజేసినట్టు ఏవో కాంతమ్మ తెలిపారు. రైవాడ అతిథి గృహం వద్ద స్థానిక తహసీల్దార్ పి.లక్ష్మీదేవి సమక్షంలో నూతనంగా నియమితులైన దేవరాపల్లి, కాశీపురం, నాగయ్యపేట, కలిగొట్ల రేషన్ డీలర్లకు నియామక పత్రాలను ఎమ్మెల్యే అందజేశారు.

నిర్దేశిత కొలతల ప్రకారం మట్టి పనులు



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న డ్వామా పీడీ పూర్ణిమాదేవి

రావికమతం : ప్రభుత్వం నిర్దేశించిన కొలతల ప్రకారం మట్టి పనులు చేసి రోజు కూలీ రూ.307 పొందాలి, ఆ ప్రకారం కూలీ వేతనం రావాలంటే ఉదయం 6 నుంచి 11 గంటల వరకు పనులు చేయాలని డ్వామా పీడీ పూర్ణిమాదేవి సూచించారు. చీమలపాడు పంచాయతీలోని ఉపాధి కూలీలకు రోజు వేతనం రూ.150 ఇస్తున్నారు.. వారంలో ఆరు రోజులు పనిచేస్తే నాలుగు రోజులే మస్తర్లు వేస్తున్నారని సోమవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద కూలీలు ధర్నా చేసిన సంగతి విదితమే. ఈ నేపథ్యంలో డ్వామా పీడీ పూర్ణిమాదేవి బుధవారం చీమలపాడు గ్రామంలో ఉపాధి పనులను పరిశీలించారు. గిరిజన కూలీలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. రోజు వారి వేతనం రూ.307 వచ్చేలా ఎంత పనిచేయాలో ఆ మేరకు మార్కింగ్ ఇచ్చి పనులు చేయించాలని, ఎన్ని రోజులు పనికి వస్తే అన్ని రోజులు మస్తర్లు వేయాలని ఫీల్డ్ సిబ్బందిని పీడీ ఆదేశించారు. పొలాలకు వెళ్లే రోడ్లు, కాలువలు, పండ్ల తోటల పెంపకం వంటి పనులు కల్పించాలని గిరిజనులు, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు గోవిందరావు కోరారు. ఎన్ని పనులు కావాలో అంచనాలు వేసి పంపించాలని ఏపీవోను ఆదేశించారు. మండలంలో ఈ ఏడాది ప్రతిపాదిత లేబర్ బడ్జెట్ 75 శాతం మ్యాన్ డేస్‌ను జూన్ నెలాఖరులోగా పూర్తి చేయించాలని ఆదేశించారు. వీఆర్పీ పనులకు రాని వారికి మస్తర్లు వేసి అవకతవకలకు పాల్పడుతున్నారని గోరా వెంకటరమణ, బొండ చిన్న దేముడు పీడీకి ఫిర్యాదు చేయగా విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకన్నబాబు, ఏపీవో చిన్నారావు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల బకాయిలు చెల్లించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న కూలీలు

చీడికాడ : ఉపాధి కూలీల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని మండలంలోని కోనాం పంచాయతీలో వివిధ గ్రామాల్లో బుధవారం సీఐటీయూ కార్యదర్శి ఆర్.దేముడునాయుడు కూలీలతో కూడి పని ప్రదేశంలో నిరసన వ్యక్తం చేశారు. కోనాం, కొండ్లకొత్తూరు, చిన కోనాం తదితర గ్రామాల్లో ఉపాధి కూలీలను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలకు రూ.50 కోట్ల మేర ప్రభుత్వం వేతన బకాయిలు చెల్లించాల్సి ఉందని అన్నారు. ఈ నెల 20న జరిగే కార్మికుల దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

భక్తి శ్రద్ధలతో హనుమాన్ దీక్షలు



మాలధారణ చేస్తున్న భక్తులు

రావికమతం: హనుమాన్ జయంతి పురస్కరించుకొని మత్స్యవానిపాలెం గ్రామంలో భక్తులు బుధవారం ఆంజనేయ స్వామి దీక్షలు చేపట్టారు. స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి సుమారు 20 మంది భక్తులకు గ్రామ పురోహితులు వేపా ధర్మఫణి ఆధ్వర్యంలో సర్పంచ్ మలిచెట్ల గణేష్, గురుస్వామి సోమిరెడ్డి శివ మాలధారణ చేయించారు. తొమ్మిది రోజుల పాటు కఠినమైన నియామాలు ఆచరించి దీక్ష చేయాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నర్సీపట్నం డివిజన్:
నర్సీపట్నం, పాయకరావుపేట : 9010234557
చోడవరం : 9010210265
మాడుగుల : 9010546644
Office mail : sakshiadvtvsp@gmail.com